# సాక్షి
## కుమురం భీం

గురువారం : 18 : ఏప్రిల్ : 2024




**గల్ఫ్‌గోసకు భరోసా**

గల్ఫ్ కార్మిక సంఘాల ప్రతినిధులతో సీఎం సమావేశమయ్యారు. జీవితబీమా, కేరళ తరహా ప్రత్యేక సంక్షేమ బోర్డు వంటి సౌకర్యాలు కల్పిస్తామని భరోసానిచ్చారు. 8లో▸



**గాలివాన బీభత్సం**

ఆసిఫాబాద్ మండలం బూర్గుడలో గాలివాన బీభత్సం సృష్టించింది. దాబాతోపాటు 15 ఇళ్లు తీవ్రంగా దెబ్బతిన్నాయి. విద్యుత్ స్తంభాలు, చెట్లు విరిగిపడ్డాయి. 8లో▸

గరిష్ఠం/కనిష్ఠం
42.5 /28.6

**వాతావరణం**

ఉదయం ఆకాశం కొంతమేర మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం తీవ్రమైన ఎండ ఉంటుంది. వడగాలులు వీస్తాయి.

## న్యూస్‌రీల్

### జొన్న పంట కొనుగోలు కేంద్రం ప్రారంభం



జొన్న పంట కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జనార్దన్, తదితరులు

**జైనూర్(ఆసిఫాబాద్):** జైనూర్ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో బుధవారం జొన్న పంట కొనుగోలు కేంద్రాన్ని పీఏసీఎస్ సీఈవో జనార్దన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జొన్న పంట క్వింటాల్‌కు ప్రభుత్వం రూ.3180 మద్దతు ధర చెల్లిస్తుందన్నారు. రైతులు కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### 25 నుంచి క్రికెట్ వేసవి శిక్షణ శిబిరం

**మంచిర్యాలరూరల్(హాజీపూర్):** హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఈ నెల 25నుంచి వేసవి క్రికెట్ శిక్షణ శిబిరం నిర్వహించనున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి కోదాటి ప్రదీప్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని మంచిర్యాల జిల్లా పరిషత్ బాలుర పాఠశాల మైదానం, ఆదిలాబాద్‌లో ఇందిరా ప్రియదర్శిని స్టేడియం, కాగజ్‌నగర్‌లో ఎస్పీఎం మైదానంలో శిక్షణ శిబిరాలు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. నెల రోజులపాటు కొనసాగుతాయని తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు మంచిర్యాల జిల్లా క్రికెట్ కోచ్ ప్రదీప్ 94400 10696, ఆదిలాబాద్ ఇన్‌చార్జి అతాఉల్లాహ 94402 07473, కాగజ్‌నగర్ ఇన్‌చార్జి శ్రీకాంత్ 94923 33333 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.



తాళిబొట్టు చూపిస్తున్న అర్చకుడు



కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి, అదనపు కలెక్టర్ దాసరి వేణు



కల్యాణానికి తరలివచ్చిన భక్తులు

# వైభవోపేతం.. రాములోరి కల్యాణం

- కనుల పండువగా శ్రీసీతారాముల కల్యాణ మహోత్సవం
- జిల్లా కేంద్రంలో ఉత్సవ విగ్రహాలతో శోభాయాత్ర
- రామనామ స్మరణతో మార్మోగిన ఆలయం
- భారీగా తరలి వచ్చిన హనుమాన్ దీక్షాపరులు, భక్తులు



జిల్లా కేంద్రంలో శోభాయాత్ర



కలెక్టర్ వెంకటేశ్ దోత్రేను సన్మానిస్తున్న అర్చకులు

**ఆసిఫాబాద్:** శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లాలో శ్రీసీతారాముల కల్యాణ మహోత్సవం వైభవోపేతంగా జరిపించారు. అశేష భక్తజనం హాజరై శ్రీరాముడి కల్యాణ ఘట్టాన్ని కనులారా తిలకించారు. రామనామ స్మరణతో ఆలయాల ప్రాంగణాలు మార్మోగాయి. జిల్లా కేంద్రంలోని జన్కాపూర్ కోదండ రామాలయంలో కల్యాణ వేడుక కనుల పండవగా సాగింది. ముందుగా తుజాల్‌పూర్ మురళీగౌడ్ ఇంటి నుంచి ఉత్సవ విగ్రహాలను హనుమాన్ దీక్షాస్వాములు బ్యాండ్ మేళాలు, నృత్యాలతో ఊరేగింపుగా గాంధీ చౌక్, అంబేద్కర్ చౌక్ మీదుగా జన్కాపూర్ రామాలయానికి తీసుకువచ్చారు. ఎమ్మెల్యే కోవ లక్ష్మి కుటుంబ సభ్యులు పట్టువస్త్రాలు, మంగళసూత్రం, ముత్యాలు సమర్పించారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వేదికపై శుభలగ్న పుష్కరాంశ సుముహూర్తంలో అర్చకులు నిమ్మకంటి మహేశ్‌శర్మ, ఒరుగుల శిరీష్‌శర్మ, నిమ్మకంటి సంతోష్, ఒరుగుల నరేశ్‌శర్మ ఆధ్వర్యంలో కల్యాణ మహోత్సవం కనుల పండువగా జరిపించారు. కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, ఎస్పీ సురేశ్‌కుమార్, అదనపు కలెక్టర్ దాసరి వేణు, జూనియర్ సివిల్ జడ్జి అనంత లక్ష్మి, పలువురు ప్రముఖులు సీతారాముల వారిని దర్శించుకున్నారు.

**తరలివచ్చిన భక్తజనం.. మార్మోగిన రామనామం**

సీతారాముల కల్యాణ ఘటాన్ని తిలకించేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. హనుమాన్ దీక్షాపరులు, భక్తులు శ్రీరామ్ నినాదాలతో హోరెత్తించారు. కల్యాణ మంటపం, షామియానాలు కిక్కిరిసిపోయాయి. సీఐ సతీశ్ ఆధ్వర్యంలో బందోబస్తు చేపట్టారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో బెల్లం పానకం పంపిణీ చేయగా, అర్చకులు నిమ్మకంటి సంతోష్‌శర్మ అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ అరిగెల మల్లికార్జున్, మాజీ ఏఎంసీ చైర్మన్ చిలువేరు వెంకన్న, మాజీ ఎంపీపీ బాలేశ్వర్ గౌడ్, గుండ వెంకన్న, నాయకులు, ఆలయ కమిటీ ప్రతినిధులు సిద్దంశెట్టి సుహాసిని, ఇరుకుల్ల ఆంజనేయులు, రూప్‌నార్ రమేశ్, డేగల సత్యనారాయణ, శివచందు, గిరిధర్, సీహెచ్ రవి, శైలేందర్, భద్రయ్య, శంకరయ్య, నాగరాజు, మహేశ్ పాల్గొన్నారు.

# సేవలందించని వేదికలు!

ఇది రెబ్బెన మండలంలోని కైరిగాం క్లస్టర్ రైతువేదిక. దీనిని ప్రారంభించిన నాటి నుంచి ఇప్పటివరకు రైతుల కోసం ఒక్క సమావేశం నిర్వహించిన దాఖలాలు లేవు. రైతువేదిక ప్రారంభానికి ముందే ఫ్లోరింగ్ పూర్తిగా దెబ్బతింది. రైతులు, సిబ్బంది కోసం నిర్మిస్తున్న మరుగుదొడ్లు అసంపూర్తిగానే ఉండిపోయాయి. ఇలా.. జిల్లాలోని అనేక రైతువేదికలు అలంకారప్రాయంగా మారాయి. రాత్రివేళల్లో మందుబాబులకు అడ్డాగా మారుతున్నాయి.



- నిరుపయోగంగా రైతువేదికలు
- వసతులు లేకపోవడంతో వినియోగించుకోలేని దుస్థితి
- పలుచోట్ల మందుబాబులకు అడ్డాలుగా మారిన వైనం
- రైతులతో సమావేశాలు నిర్వహించని ఏఈవోలు
- జిల్లాలో రెండుచోట్ల మాత్రమే వీడియో కాన్ఫరెన్స్ సేవలు



కైరిగాం రైతువేదిక ఎదుట దెబ్బతిన్న ఫ్లోరింగ్

**రెబ్బెన(ఆసిఫాబాద్):** మెరుగైన దిగుబడులు సాధించేందుకు రైతులకు సూచనలు, సలహాలు అందించేందుకు.. వ్యవసాయ రంగంలో వస్తున్న మార్పులు, ఆధునిక పద్ధతులపై అవగాహన కల్పించేందుకు ఏర్పాటు చేసిన రైతువేదికలు లక్ష్యానికి దూరమయ్యాయి. గతంలో వ్యవసాయ శాఖ అధికారులు గ్రామాలకు వెళ్లి స్థానికంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలు, పంచాయతీ కార్యాలయాల ఆవరణలో, భవనాలు అందుబాటులో లేని ప్రాంతాల్లో చెట్ల కిందే సమావేశాలు నిర్వహించి రైతులకు సాగులో సూచనలు, సలహాలు ఇచ్చేవారు. దీనిని దృష్టిలో ఉంచుకుని గత ప్రభుత్వం వ్యవసాయశాఖ సేవలను మరింత చేరువ చేసే ఉద్దేశంతో ప్రతీ క్లస్టర్‌కు ఒక రైతువేదిక నిర్మించింది. రైతువేదిక నిర్మాణంపై చూపిన శ్రద్ధ వాటిని వినియోగించుకోవటంపై లేకపోవడంతో రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన వేదికలు నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి.

**రైతులకు సూచనలు, సలహాలేవీ..?**

వ్యవసాయంలో రోజురోజుకు వస్తున్న ఆధునిక పద్ధతులు పాటించడం ద్వారా రైతులకు సమయంతోపాటు డబ్బు ఆదా అవుతుంది. అయితే నేటికీ గ్రామీణ రైతులు పాతకాలం సాగు పద్ధతులనే అవలంబిస్తున్నారు. యాజమాన్య పద్ధతులు, తెగుళ్ల నివారణకు సస్యరక్షణ చర్యల కోసం అధికారుల సూచనలు, సలహాలు అందకుండా పోతున్నాయి. ప్రత్యేకంగా వ్యవసాయశాఖ అధికారులను సంప్రదిస్తే తప్పా వారు జాగ్రత్తలు, తెగుళ్ల నివారణకు చేపట్టాల్సిన చర్యలను వివరించడం లేదు. ఫలితంగా రైతులు తమకున్న అనుభవంతోనే పంటలు సాగు చేస్తున్నారు. సమయం, డబ్బు వృథా కావడంతోపాటు దిగుబడి తగ్గి నష్టాలు చవిచూస్తున్నారు. ఈ సమస్య నుంచి రైతులను గట్టెక్కించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన రైతువేదికల్లో సమావేశాలు, అవగాహన సదస్సులు మాత్రం నిర్వహించడం లేదు.

**ముంచుకొస్తున్న సీజన్..**

మరో రెండు నెలల్లో వానాకాలం సీజన్ ప్రారంభం కానుంది. ఇప్పటికే జిల్లాలోని రైతులు పత్తి పంటల సాగు కోసం భూములు సిద్ధం చేసే పనుల్లో నిమగ్నమయ్యారు. పత్తి చెట్లు తొలగించి భూమిని చదును చేయటం, పిచ్చిమొక్కలు, చెత్తాచెదారం తొలగిస్తున్నారు. వేసవి దుక్కులు దున్నుకున్న వారు తొలకరి వర్షాలకు విత్తనాలు విత్తుకుంటారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో జూన్ రెండో వారం నుంచే పత్తి విత్తనాలు విత్తుతారు. ఈ సమయంలో విత్తనాల ఎంపికలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నకిలీ విత్తనాలపై రైతులను అప్రమత్తం చేసేందుకు అవగాహన సదస్సు నిర్వహించాల్సి ఉంది. ఏటా సీజన్‌కు నెల రోజుల ముందే జిల్లాకు పెద్దఎత్తున నకిలీ విత్తనాలు సరాఫరా అవుతున్నాయి. వ్యవసాయశాఖ, పోలీస్ శాఖ అధికారులు ఈ దందాను అరికట్టడంలో విఫలమవుతూనే ఉన్నారు. అన్నదాతల అమాయకత్వాన్ని ఆసరా చేసుకుంటూ నకిలీ విత్తనాలు అంటగడుతుండటంతో దిగుబడి రాక నష్టపోతున్నారు.

### రైతునేస్తం కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం



జిల్లాలో డివిజన్‌కు ఒక రైతువేదికను ఎంపిక చేసి రైతులకు సీజన్‌ల వారీగా పంటల సాగుపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతునేస్తం కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ప్రతీ మంగళవారం ఈ కార్యక్రమం కొనసాగుతోంది. మిగిలిన రైతువేదికల్లోనూ ఈ తరహా కార్యక్రమాలను నిర్వహించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. గ్రామాలకు దూరంగా రైతువేదికలు ఉండటంతో వీడియో కాన్ఫరెన్స్ సామగ్రికి భద్రత లేకుండా పోతుందనే కారణంగా ప్రస్తుతం ఆయా చోట్ల రైతునేస్తం కార్యక్రమాన్ని చేపట్టడం లేదు. నిర్వహణకు నిధులు రాక ఏఈవోలే నిర్వహణ చూసుకుంటున్నారు.

– శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయాధికారి

### సౌకర్యాల లేమి..



గంగాపూర్ రైతువేదిక వద్ద అసంపూర్తిగా మరుగుదొడ్లు

జిల్లాలోని 15 మండలాల పరిధిలో 70 క్లస్టర్లు ఉండగా ఒక్కో క్లస్టర్ ఒక రైతు వేదిక నిర్మించారు. ఉదయం పూట ఏఈవోలు క్షేత్రస్థాయికి వెళ్లి పంటలు పరిశీలించి మధ్యాహ్నం నుంచి రైతువేదికల్లో అందుబాటులో ఉండాలని ఆదేశాలు ఉన్నాయి. ఇప్పటికీ అనేక చోట్ల తాగునీటి, విద్యుత్ సౌకర్యం లేదు. ప్రధానంగా మరుగుదొడ్ల నిర్మాణాలు ఇంకా అసంపూర్తిగానే ఉండటంతో మహిళా ఏఈవోలు, రైతులు ఇబ్బంది పడుతున్నారు. రైతువేదిక నిర్వహణకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడంతో వాటిని ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. దుమ్ముధూళితో నిండిపోయాయి. కొన్ని ప్రాంతాల్లో మందుబాబులకు అడ్డాగా, అసాంఘిక కార్యకలాపాలకు నిలయాలుగా మారిపోయాయి. ఇటీవల అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతులు నేరుగా వ్యవసాయ శాస్త్రవేత్తలతో సమావేశమయ్యేందుకు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించాలని నిర్ణయించింది. దీని ద్వారా రైతులు తమ సందేహాలు నివృత్తి చేసుకోవచ్చని సూచించింది. జిల్లాలో ఒకటి, రెండు చోట్ల మాత్రమే ఈ సదుపాయం అందుబాటులోకి వచ్చింది.

# నేటి నుంచి నామినేషన్లు

- ఈ నెల 25 వరకు స్వీకరణ
- ఉదయం 11నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు..
- ఆదిలాబాద్ కలెక్టరేట్‌లో పకడ్బందీ ఏర్పాట్లు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ గౌస్ ఆలం, తదితరులు

**కైలాస్‌నగర్:** పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ నేటి నుంచి షురూ కానుంది. ఈ నెల 25 వరకు నామినేషన్లు స్వీకరించనున్నారు. ఆదిలాబాద్‌లోని కలెక్టర్ చాంబర్‌లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లు స్వీకరించనున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షిషా అన్నారు. ఆదిలాబాద్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కలెక్టర్ వివరాలు వెల్లడించారు. ఈనెల 26న నామినేషన్ల పరిశీలన, 29వరకు ఉపసంహరణ గడువు ఉన్నట్లు తెలిపారు. మే 13న పోలింగ్ ఉంటుందని పేర్కొన్నారు. సిర్పూర్, ఆసిఫాబాద్ నియోజకవర్గాల్లో ఉదయం 7నుంచి సాయంత్రం 4గంటల వరకు, ఆదిలాబాద్, బోథ్, నిర్మల్, ముథోల్, ఖానాపూర్ నియోజకవర్గాల్లో ఉదయం 7నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ ఉంటుందని పేర్కొన్నారు. ఏఆర్‌వోగా ఆదిలాబాద్ ఆర్డీవో వినోద్‌కుమార్‌ను నియమించినట్లు తెలిపారు.

**ప్రత్యేక సహాయ కేంద్రం..**

నామినేషన్ల స్వీకరణ సందర్భంగా కలెక్టరేట్‌లో ప్రత్యేక సహాయ కేంద్రం ఏర్పాటు చేశారు. నామినేషన్ కోసం వచ్చే అభ్యర్థులకు సంబంధించి వంద మీటర్ల వరకు మూడు వాహనాలను అనుమతిస్తారు. అభ్యర్థితో పాటు మరో నలుగురిని లోనికి అనుమతించనున్నారు. అభ్యర్థి డిపాజిట్ కింద రూ.12,500 నగదు లేదా ప్రభుత్వ బ్యాంకులు, కార్యాలయాల్లో తీసిన డీడీ రూపంలో చెల్లించవచ్చు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల అభ్యర్థులకు ఒక ప్రపోజర్ సరిపోతుంది. గుర్తింపులేని రాజకీయ పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులైతే పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఓటు హక్కు కలిగిన పది మంది ప్రతిపాదకులను తీసుకురావాల్సి ఉంటుంది. హెల్ప్ డెస్క్‌లో ప్రత్యేక కంప్యూటర్లతో పాటు ఆపరేటర్లను నియమించారు. దీనికి ఆదిలాబాద్ రూరల్ తహసీల్దార్ శ్రీనివాస్ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తారు. వెయిటింగ్ రూమ్ సైతం ఏర్పాటు చేశారు. సెక్యూరిటీ డిపాజిట్ పరిశీలనకు భీంపూర్ తహసీల్దార్‌ను ఇన్‌చార్జిగా నియమించారు. నామినేషన్లకు సంబంధించిన పత్రాల పరిశీలన, ఓటరు లిస్ట్, సీరియల్ నంబర్, పార్ట్ నంబర్ వంటి వాటి పరిశీలన కోసం ఆదిలాబాద్ అర్బన్ తహసీల్దార్ ఎస్.శ్రీనివాస్‌ను ఇన్‌చార్జిగా నియమించారు.

**అభ్యర్థులకు ప్రత్యేక హ్యాండ్ బుక్..**

ఎంపీగా పోటీ చేసే అభ్యర్థులకు హ్యాండ్ బుక్‌తో పాటు ఎన్నికల ప్రవర్తన నియమావళిని అమలు చేసేలా పత్రాలను అందజేయనున్నారు. అభ్యర్థులు నామినేషన్‌కు ముందే ప్రత్యేక బ్యాంకు ఖాతా తెరవాల్సి ఉంటుంది. పోటీ చేసే అభ్యర్థి సంతకం చేస్తే ముందు చేయవచ్చు.. వేలిముద్ర వేసేవారైతే రిటర్నింగ్ అధికారి ముందే వేయాల్సి ఉంటుంది. అభ్యర్థులపై క్రిమినల్ కేసులు ఉంటే ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలో మూడుసార్లు తప్పనిసరిగా ప్రకటించాల్సి ఉంటుంది. అభ్యర్థులు, వారి ఏజెంట్లకు సంబంధించి స్పెసిమెన్ సిగ్నిచర్లకు సంబంధించి హార్డ్, సాఫ్ట్ కాపీలను ఫారం–7ఏలో అందజేయాల్సి ఉంటుంది. అభ్యర్థులు రూ.95లక్షల వరకు ఎన్నికల ప్రచారం కోసం ఖర్చు చేయవచ్చు. రూ.10వేలకు మించితే ఆన్‌లైన్ పద్ధతిలోనే ఖర్చు చేయాలి.

**పోస్టల్ బ్యాలెట్ అందజేత..**

పార్లమెంట్ ఎన్నికల్లో 5,940 మంది ఉద్యోగులు విధులు నిర్వహించనున్నారు. ఇందులో పీవో, ఏపీవో, ఓపీవో 4,122 మంది ఉండగా, పోలీసు బెటాలియన్‌కు సంబంధించి 635, ఇతర సిబ్బంది 183 మంది ఉన్నారు. వీరందరికీ ఇదివరకే శిక్షణ ఇవ్వగా, ఆ సమయంలోనే పోస్టల్ బ్యాలెట్‌కు సంబంధించి ఫారం–12 అందజేశారు. సదరు ఉద్యోగులు తమ సొంత నియోజకవర్గం లేదా శిక్షణ కేంద్రంలో ఓటు వినియోగించుకునేందుకు అవకాశం ఉంది. సొంత నియోజకవర్గంలో ఓటు హక్కు వినియోగించుకునే వారికి ఒకరోజు క్యాజువల్ సెలవు ఇవ్వనున్నారు. వీరికి మే 3 నుంచి 8వరకు ఓటు హక్కు వినియోగించుకునేలా చర్యలు చేపడుతున్నారు. పార్లమెంట్ పరిధిలో మొత్తం ఓటర్లు 16లక్షల 44వేల 715 మంది ఉండగా.. ఇందులో 2,150 మంది సర్వీసు ఓటర్లు ఉన్నారు.

**హోం ఓటింగ్..**

85 ఏళ్లు పైబడిన వృద్ధులు, 40 శాతం కంటే ఎక్కువ వైకల్యం గల దివ్యాంగులు హోం ఓటింగ్ వినియోగించుకోవచ్చు. ఇప్పటికే జిల్లాలో ఇలాంటి వారందరికీ ఫారం–12డి అందజేశారు. ఈనెల 25 వరకు వాటిని స్వీకరించనున్నారు. ఇలా అందిన వివరాల ఆధారంగా హోం ఓటింగ్‌కు చర్యలు చేపడుతారు. వీరితో పాటు అత్యవసర సర్వీసుల్లో పనిచేసే బీఎస్ఎన్ఎల్, సివిల్ సప్లయ్, రైల్వే, ట్రాన్స్‌పోర్ట్, ఎలక్ట్రిసిటీ, వైద్యారోగ్య శాఖ వంటి శాఖల ఉద్యోగులకు సైతం పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కల్పించారు.

# ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలి

- రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్



వీసీలో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

**ఆసిఫాబాద్‌అర్బన్:** లోక్‌సభ ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్ అన్నారు. బుధవారం హైదరాబాద్ నుంచి ఉన్నతాధికారులతో కలిసి కలెక్టర్లు, ఎన్నికల విభాగం అధికారులతో నామినేషన్ల ప్రక్రియ, తుది ఓటరు జాబితా రూపకల్పనపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 18న రిటర్నింగ్ అధికారులు నోటిఫికేషన్ విడుదల చేయాలన్నారు. 25 వరకు నామినేషన్ల ప్రక్రియను పారదర్శకంగా చేపట్టాలన్నారు. ఎన్నికల నిర్వహణకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశామని తెలిపారు. అభ్యర్థులు నామినేషన్లు సమర్పించే సమయంలో తప్పనిసరిగా వీడియో చిత్రీకరణ జరగాలన్నారు. పెండింగ్ ఓటరు నమోదు దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. ప్రతీ ఓటరుకు ఓటరు స్లిప్పులు చేరేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేశ్ దోత్రే మాట్లాడారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు 79 పోలింగ్ కేంద్రాలను అదనంగా ఏర్పాటు చేశామని తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ దాసరి వేణు, డీఆర్‌వో లోకేశ్వర్‌రావు, ఆర్డీవో సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### పాఠశాల మేనేజర్, ప్రిన్సిపాల్‌పై కేసు నమోదు

దండేపల్లి: మండలంలోని కన్నెపల్లి మదర్ థెరిస్సా పాఠశాల మేనేజర్ (కరస్పాండెంట్) జైసన్, ప్రిన్సిపాల్ జోబిపై బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై స్వరూప్‌రాజ్ తెలిపారు. పాఠశాలలో నాలుగోతరగతి చదువుతున్న ముగ్గురు విద్యార్థులు హనుమాన్ దీక్ష తీసుకోగా వారిని యూనిఫాం వేసుకోవాలని ప్రిన్సిపాల్ ఇబ్బందులకు గురిచేయడం మంగళవారం ఆందోళనకు దారితీసింది. దీంతో ఓ విద్యార్థి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు మేనేజర్, ప్రిన్సిపాల్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెల్లడించారు.

### విద్యుత్‌షాక్‌తో మహిళ మృతి


మౌనిక (ఫైల్)

కాసిపేట: మండలంలోని కోమటిచేనుకు చెందిన బెడ్డల మౌనిక (28) విద్యుత్‌షాక్‌తో బుధవారం మృతి చెందినట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. వాటర్‌ట్యాంక్‌లో నీటిని పరిశీలించేందుకు ఇంటిపైకి ఎక్కింది. అయితే తెగిపోయిన విద్యుత్ వైరు ఇనుప రేకులకు తాకింది. వాటిని తాకిన మౌనికకు విద్యుత్‌షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందినట్లు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతురాలి తండ్రి జాడి రామకృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

### ఆర్టీసీ బస్టాండ్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతి


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో బుధవారం ఓ గుర్తు తెలియని వ్యక్తి (40) మృతి చెందినట్లు సీఐ బన్సీలాల్ తెలిపారు. బస్టాండ్‌లోని ఆసిఫాబాద్‌కు వెళ్లే ప్లాట్‌ఫాం వద్ద వ్యక్తి పడిపోయి ఉండడంతో ప్రయాణికుల సమాచారం మేరకు అక్కడికి వెళ్లి పరిశీలించగా అప్పటికే మృతి చెంది ఉన్నాడు. మృతదేహం వద్ద అతనికి సంబంధించిన ఎలాంటి ఆధారాలు లభించలేదు. మద్యం సేవించి ఎండలో బస్టాండ్‌కు వచ్చి మృతి చెందినట్లు భావిస్తున్నామన్నారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రిలోని మార్చురీ గదిలో భద్రపరిచామన్నారు. వివరాలు తెలిసిన వారు పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు.

### నేడు స్వగ్రామానికి గల్ఫ్ మృతదేహం

ఖానాపూర్: పట్టణంలోని సుభాష్‌నగర్ కాలనీకి చెందిన ఉప్పు నవీన్ ఇటీవల గల్ఫ్ దేశంలోని బెహరాన్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. నిరుపేద కుటుంబం కావడంతో మృతదేహం తెప్పించే స్తోమత లేదు. దీంతో మృతుని కుటుంబ సభ్యులు ఖానాపూర్ నివాసి వొడ్డెపల్లి కృష్ణంరాజును కలిసి గోడు వెల్లబోసుకున్నారు. స్పందించిన కృష్ణంరాజు బెహరాన్, ఇండియన్ ఎంబసీలతో పాటు ఇరువురు అధికారులతో మాట్లాడి మృతదేహం స్వగ్రామానికి వచ్చేందుకు మార్గం సుగమం చేశారు. గురువారం ఖానాపూర్‌కు మృతదేహం వచ్చేలా అన్నిరకాల ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

# గల్ఫ్ గోసకు భరోసా

- కార్మికసంఘాలతో భేటీలో సీఎం హామీ
- గల్ఫ్ కార్మిక కుటుంబాల్లో హర్షాతిరేకాలు
- గల్ఫ్‌దేశాల్లో వేలాదిమంది జిల్లావాసులు
- బీమా, సంక్షేమబోర్డుపై కీలక నిర్ణయాలు
- సెప్టెంబర్ నాటికి విధానానికి తుదిరూపు


సీఎం రేవంత్‌రెడ్డితో గల్ఫ్ జేఏసీ నాయకులు

నిర్మల్‌ఖిల్లా: రెక్కడితేగానీ డొక్కాడని బతుకులు.. ఉద్యోగ ఉపాధి అవకాశాల కోసం గల్ఫ్ దేశాలకు వెళ్లి అక్కడ రోజుకూలితో బతుకీడిస్తున్నారు. ఉమ్మడి జిల్లా నుండి దాదాపు70 వేలకుపైగా కార్మికులు గల్ఫ్ దేశాలకు వెళ్లి ఉపాధి నిమిత్తం అక్కడ నివసిస్తున్నారు. నాలుగేళ్లలో దాదాపు 120 మందికి పైగా కార్మికులు గల్ఫ్ దేశాల్లోనే పని ప్రదేశాల్లో ప్రమాదవశాత్తు మృతి చెందారు. మృతదేహాలు ఇంటికి రావడానికి నెలల తరబడి వేచిచూసిన దయనీయ ఘటనలు ఉమ్మడి జిల్లాలో నెలకొన్నాయి. మంగళవారం కాంగ్రెస్ పార్టీ ఎన్నారై సెల్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గల్ఫ్ కార్మిక సంఘాల ప్రతినిధులతో సీఎం రేవంత్‌రెడ్డి సమావేశం నిర్వహించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు చెందిన ప్రవాసీమిత్ర కార్మికసంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రదేశ్ పరికిపండ్ల, గల్ఫ్‌జేఏసీ నాయకులు దొనికెన కృష్ణ, పోతుగంటి సాయెందర్, గుండేటి గణేశ్, తదితరులు పాల్గొని సమస్యలను ప్రస్తావించారు. అయితే గల్ఫ్ కార్మికులకు జీవితబీమా, కేరళ తరహా ప్రత్యేక సంక్షేమ బోర్డు, ప్రజాభవన్‌లో ప్రత్యేక మానిటరింగ్ వ్యవస్థ, మృతులకు రూ.5 లక్షల ప్రమాదబీమా వంటి సౌకర్యాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారిస్తామని స్వయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భరోసా ఇచ్చారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి నిర్ణయంతో గల్ఫ్ కార్మికుల కుటుంబాల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

**స్వయంగా సీఎం సమీక్ష ...**

చాలాకాలంగా అపరిష్కృతంగా ఉన్న గల్ఫ్ కార్మికుల సంక్షేమం కోసం నిర్ణయాలను సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. మంగళవారం హైదరాబాద్‌లోని హోటల్ తాజ్ డెక్కన్ వేదికగా కాంగ్రెస్ ఎన్నారై సెల్ విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో గల్ఫ్ కార్మిక సంఘాల ప్రతినిధులతో పాటు ఆయా గల్ఫ్ దేశాలకు సంబంధించిన ప్రతినిధులు కూడా పాల్గొన్నారు. హాజరైన సీఎం రేవంత్ రెడ్డి గల్ఫ్ కార్మికుల పక్షాన పలు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తామని భరోసానిచ్చారు. వీరి కోసం ప్రత్యేకంగా బోర్డు ఏర్పాటు, సీనియర్ ఐఏఎస్ అధికారి నేతృత్వంలో 24 గంటలు అందుబాటులో ఉండేలా ప్రజాభవన్‌లో ప్రత్యేక కార్యాలయం, టోల్ ఫ్రీ నెంబర్ సౌకర్యం, సెప్టెంబర్ 17 లోపు పకడ్బందీ వ్యవస్థను ఏర్పాటు చేసే దిశగా బాధ్యత తీసుకుంటానని హామీ ఇచ్చారు. గల్ఫ్ దేశాల్లో మృతి చెందిన కార్మికులకు రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా అందిస్తామన్నారు. పలు రాష్ట్రాల గల్ఫ్ విధానాలను అధ్యయనం చేసి ముసాయిదా రూపొందించి అందరి సలహాలు సూచనలు స్వీకరించి అమలుపరుస్తామన్నారు.

**గల్ఫ్‌గోస గతం నుంచే ...**

గల్ఫ్ కార్మిక సంఘాల గణాంకాల ప్రకారం ఉమ్మడి జిల్లా నుంచి దాదాపు 80 వేలకు పైగా దుబాయ్, ఒమన్, మస్కట్, సౌదీ అరేబియా, ఇరాన్, ఇరాక్, బహ్రెయిన్, కువైట్, మలేషియా, ఖతర్, తదితర 18 గల్ఫ్‌దేశాల్లో ఉపాధి పొందుతున్నారని అంచనా. ప్రధానంగా నిర్మల్, మంచిర్యాల, ఆదిలాబాద్ జిల్లాల్లోని ముధోల్, ఖానాపూర్, నిర్మల్, మంచిర్యాల, బెల్లంపల్లి, బోథ్, తదితర ప్రాంతాల నుంచే ఎక్కువగా తరలివెళ్లారు. ఈ వలసలు 1990 నుంచి మరింత ఎక్కువయ్యాయి. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావం నాటి నుంచి ఎన్ఆర్ఐ పాలసీ అమలు చేయాలని, రాష్ట్ర బడ్జెట్లో రూ.500 కోట్లు కేటాయించి సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తులు చేస్తూ వస్తున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి పలు కీలక నిర్ణయాలను ప్రకటించడంతో గల్ఫ్ కార్మిక కుటుంబాల్లో ఆశలు రేకెత్తుతున్నాయి.

### సబ్సిడీ రుణం ఇప్పించాలి



18 ఏళ్లపాటు గల్ఫ్ దేశంలో పనిచేసి స్వగ్రామానికి తిరిగొచ్చా. ప్రస్తుతం కూలీపని చేసుకుని కుటుంబాన్ని పోషించుకుంటున్నా. మాలాంటి గల్ఫ్ రిటనీలకు ఏదైనా కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణం ఇప్పిస్తే స్వయం ఉపాధి రంగంలో నిలదొక్కుకుంటాం. ఈ దిశగా రాష్ట్ర ప్రభుత్వం ఆలోచన చేయాలి.

– బొశెట్టి పోశెట్టి, గల్ఫ్ రిటనీ, చించోలి(బీ), సారంగపూర్

### సత్వరమే అందితే సంతోషం



నా భర్త బెజ్జారం రమేశ్ గతేడాది ఆగస్టులో దుబాయ్‌లో మృతి చెందాడు. డిసెంబర్‌లో నిర్వహించిన ప్రజాపాలనలో రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా కోసం దరఖాస్తు చేసుకున్నా. నా ఇద్దరు పిల్లలు, అత్తామామలు ఆర్థిక సాయం కోసం వేచి చూస్తున్నాం. పరిహారం సత్వరమే అందితే నా కుటుంబానికి తోడ్పాటుగా ఉంటుంది.

– బెజ్జారం లక్ష్మి, కౌట్ల (బీ), సారంగపూర్

### సెప్టెంబర్ నాటికి అమలు..



గల్ఫ్ కార్మికులు సుదీర్ఘ కాలంగా ఎదుర్కొంటున్న సమస్యలను సీఎంకు వివరించాం. అన్ని అంశాలను విశ్లేషించి గల్ఫ్ కార్మిక సంక్షేమ పథకాలను ప్రభుత్వ పాలసీగా సెప్టెంబర్ నాటికి తీసుకువస్తామని హామీ ఇచ్చారు. ఈ విధానాల అమలువల్ల గల్ఫ్ కార్మికులు, కుటుంబ సభ్యులకు ప్రయోజనం చేకూరుతుంది. గల్ఫ్ దేశాలకు వెళ్తున్న వారికి ముందస్తు అవగాహన కార్యక్రమాలు, నైపుణ్య శిక్షణ వంటివి కూడా చేపడతామన్నారు.

– స్వదేశ్ పర్కిపండ్ల, ప్రవాసీమిత్ర రాష్ట్ర అధ్యక్షుడు

### అగ్నిప్రమాదంలో ఇల్లు దగ్ధం


దగ్ధమైన ఇల్లు

ఆసిఫాబాదరూరల్: మండలంలోని కొటగూడలో బుధవారం సాయంత్ర జరిగిన అగ్ని ప్రమాదంలో ఇల్లు దగ్ధమైంది. గ్రామానికి చెందిన గెడెం లక్ష్మణ్ కుటుంబ సభ్యులు శ్రీరామనవమి సందర్భంగా ఇంట్లో దేవుడికి పూజలు చేసి దీపం పెట్టి ఆలయం వద్ద జరుగుతున్న వేడుకలకు వెళ్లారు. దీపం ఇంట్లో ఉన్న వస్తువులకు అంటుకోవడంతో మంటలు చెలరేగి ఇంటి ముందున్న రేకుల షెడ్డు పూర్తిగా కాలిపోయింది. ఇంట్లో ఉన్న సిలిండర్ పేలడంతో పైకప్పు రేకులు చెల్లాచెదురయ్యాయి. గమనించిన స్థానికులు ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించడంతో సిబ్బంది వచ్చి మంటలు ఆర్పివేశారు. ఘటనలో బీరువాలో ఉన్న బంగారం, వెండి ఆభరణాలు అగ్నికి ఆహుతయ్యాయి. ప్రమాదంలో సుమారు రూ. 2 లక్షల వరకు ఆస్తినష్టం జరిగినట్లు తెలుస్తోంది. ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

### బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికి కృషి

బజార్‌హత్నూర్: ఎన్నికల్లో గెలిపిస్తే బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికి కృషి చేస్తానని కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ అన్నారు. బుధవారం మండలంలోని భూతాయి, చందునాయక్ తాండ, మొర్కండి, ఉప్పర్‌పల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఆడే గజేందర్, జెడ్పీటీసీ మల్లెపూల నర్సయ్య, నాయకులు జల్కే పాండురంగ్, విఠల్, కిషన్, నారాయణ, రాజు, తదితరులు పాల్గొన్నారు.

## 24న టీబీజీకేఎస్ సర్వసభ్య సమావేశం

- స్టీరింగ్ కమిటీ చైర్మన్ మిర్యాల రాజిరెడ్డి


మాట్లాడుతున్న మిర్యాల రాజిరెడ్డి

శ్రీరాంపూర్: ఈ నెల 24న టీబీజీకేఎస్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఆయూనియన్ స్టీరింగ్ కమిటీ చైర్మన్ మిర్యాల రాజిరెడ్డి తెలిపారు. బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్మికుల సమస్యలపై చర్చించి తీర్మాణాలు చేసి వాటి అమలుకు తీసుకోవాల్సిన చర్యలపై కార్యాచరణ చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా యూనియన్ కేంద్ర కమిటీని ఎన్నుకోనున్నట్లు తెలిపారు. సింగరేణి వ్యాప్తంగా ఉన్న యూనియన్ ముఖ్య నేతలు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని కోరారు. వేసవి ఎండలు తీవ్రమైనందున ఓసీపీల్లో షిఫ్ట్‌వేళలూ మార్చాలని డిమాండ్ చేశారు. కార్మిక కుటుంబాలకు కార్పొరేట్ వైద్యం అందించే సమయంలో ఐడీ కార్డులు, ఇతర ఫారాలు తీసుకొని వెళ్లాల్సి వస్తుందని, ఈ ఇబ్బందులు లేకుండా ఉద్యోగి ఎంప్లాయి కోడ్‌తో నేరుగా కార్పొరేట్ ఆసుపత్రుల్లో శాప్ ప్రోగ్రాం ద్వారా చికిత్స అందేలా వెసులుబాటు కల్పించాలని కోరారు. సింగరేణి చరిత్రలోనే సంస్థ 70 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తిని సాధించిందని, కష్టపడి పనిచేసిన కార్మికులకు బంగారునాణెం బహుమతిగా ఇవ్వాలని కోరారు. వివిధ గని ప్రమాదాల్లో మృతి చెందిన కార్మికులను స్మరించుకొనేందుకు స్మృతి వనం లేదా, అమరువీరుల స్తూపం నిర్మించాలన్నారు. ఈ సందర్భంగా జనరల్ బాడీ సమావేశానికి సంబంధించిన వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. సమావేశంలో ఆ యూనియన్ బ్రాంచి ఇన్‌చార్జి పెట్టం లక్ష్మణ్, నాయకులు పానుగంటి సత్తయ్య, బండి రమేశ్, తొంగల రమేశ్, పొగాకు రమేశ్, అన్వేశ్‌రెడ్డి, సంతోశ్, శ్రీనివాస్, రాజునాయక్, తదితరులు పాల్గొన్నారు.

# గాలివాన బీభత్సం

- ఆసిఫాబాద్ మండలం బూర్గుడలో దెబ్బతిన్న 15 ఇళ్లు
- విరిగిన విద్యుత్ స్తంభాలు, నిలిచిన సరఫరా


బూర్గుడలో దెబ్బతిన్న ఇల్లు

ఆసిఫాబాద్‌రూరల్: బలమైన ఈదురుగాలులతో బుధవారం కురిసిన వాన కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో బీభత్సం సృష్టించింది. ఆసిఫాబాద్ మండలం బూర్గుడలో గాలివాన ధాటికి గ్రామంలోని 15 ఇళ్లు దెబ్బతిన్నాయి. గాజుల పెంటయ్య, చిగురు గోపాల్, పుధరి పెంటక్క, బుజాడి బొడ్డు, బిజ్జు, దర్ని రమేశ్, ఎరుబోతు వినోద్, పులగం శంకర్, దాడి రాగులయ్య, చీల్లరి నర్సయ్య, గాజుల పెంటయ్య, బోద సురేశ్‌కు చెందిన ఇళ్ల పైకప్పులు ఎగిరిపోయాయి. నిత్యావసరాలు తడిసిపోయాయి. గాలికి ఎగిరి వచ్చిన రేకు పుదారి చంద్రయ్యకు చెందిన ఎద్దుకు తగలడంతో తీవ్రంగా గాయపడింది. ఇంటి పైనుంచి రాయి పడటంతో పూదారి పెంటక్క, చెట్టు కొమ్మలు మీదపడి లోకండే చిన్నక్కకు గాయాలయ్యాయి. వీరిని స్థానికులు 108 వాహనంలో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బూర్గుడ సమీపంలోని దాబా తీవ్రంగా దెబ్బతింది. రోడ్డుపై ఆగి ఉన్న లారీ బోల్తా పడింది. బూర్గు, మోతుగూడగ్రామాల్లో ఎనిమిది విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డారు. బూర్గుడతోపాటు ఈదులవాడ, అప్పపల్లి, రహపల్లి, కొమ్ముగూడ, గొల్లగూడ గ్రామాలకు విద్యుత్ సరఫరాను పూర్తిగా నిలిపివేశారు.


రేకు తగిలి గాయపడిన ఎద్దు


రహదారి పక్కన ఆనవాళ్లు కోల్పోయిన దాబా


బూర్గుడలో విరిగిన విద్యుత్ స్తంభం


గాలి ఉధృతికి బోల్తా పడిన లారీ

## జోరుగా ఇసుక అక్రమ రవాణా


ఇసుక లోడుతో వెళ్తున్న నంబర్ లేని ట్రాక్టర్



అందుగులపేటలో నిల్వ ఉంచిన ఇసుక

- సిమెంట్ ఇటుకల తయారీదారుల వద్ద నిల్వలు
- వాగుల నుంచి ట్రాక్టర్లలో తరలింపు

మందమర్రిరూరల్: మండలంలోని పాలవాగు, రాళ్ల వాగు, పెద్దవాగు, కొండెంగల వాగుల నుంచి ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. ఇసుక తోడేస్తుండడంతో భూగర్భ జలం అడుగంటిపోతోంది. అధికారులు పట్టించుకోకపోవడంతో ట్రాక్టర్ల యజమానులు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. వర్షాలు పడిన సమయంలో వరద రాగానే ఇసుక మేటలు వేస్తుంది. వర్షాలు తగ్గిన తర్వాత ట్రాక్టర్ల యాజమనులు అక్రమంగా తరలిస్తూ ఒక్కో ట్రిప్పు రూ.3వేలకు విక్రయిస్తున్నారు. మండలంలోని సిమెంటు ఇటుకల తయారీదారులు అక్రమంగా ఇసుక నిల్వ చేస్తున్నారు. ట్రాక్టర్ల యజమానులు నంబర్లు లేని ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తరలించి అనుకూలమైన ప్రదేశంలో నిల్వ చేస్తున్నారు. ఎవరైనా అడిగితే అప్పటికప్పుడు చేరవేస్తున్నారు. వాగుల్లో నుంచి ఇసుక తరలిపోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. ఇసుక తరలింపుపై మందమర్రి తహసీల్దార్ చంద్రశేఖర్‌ను సంప్రదించగా.. వాగుల్లో నుంచి ఇసుక తరలింపునకు అనుమతి లేదని, అక్రమంగా తరలిస్తే కేసులు నమోదు చేస్తామని తెలిపారు.

## మామిడి కోతలు షురూ

నెన్నెల: మండలంలోని చిత్తాపూర్, నందులపల్లి, జెండావెంకటాపూర్, నెన్నెల, మైలారం, కొత్తూర్, గంగారాం గ్రామాల్లో మామిడి కోతలు షురువయ్యాయి. వారం రోజులుగా కాయలు కోస్తున్నారు. మండలంలో సుమారు 6 వేల ఎకరాల్లో మామిడి తోటలు ఉన్నాయి. గత ఏడాదితో పోల్చితే ఈసారి 20 శాతం దిగుబడి తగ్గిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉండడంతో ముందస్తుగానే కోతలు చేపట్టారు. ఆలస్యమైతే గాలి దుమారం, అకాల వర్షాలతో కాయలు నేలరాలుతాయని రైతులు చెప్పారు. గతేడాది బంగెన్‌పల్లి కిలో రూ.30 నుంచి రూ.40 పలకగా ఈయేడు నాగ్‌పూర్ మార్కెట్‌లో రూ.50 నుంచి రూ.60 పలుకుతోంది. ఈ సమయంలో దిగుబడి వస్తే మంచి లాభాలు వస్తాయని రైతులు చెబుతున్నారు. దసేరి, పెద్దరసం, తోతపరి, బంగెన్‌పల్లి, సుందరిలాంటి మామిడి తోటలు ఎక్కువగా ఉన్నాయి. తక్కువ దిగుబడి వచ్చిన మామిడి కాయలను మహారాష్ట్ర మార్కెట్‌కు తరలించడంతో కొంత మేర రవాణా ఖర్చులతో లాభం తగ్గుతుందని పేర్కొంటున్నారు. స్థానికంగా మార్కెట్ ఉంటే మంచి లాభాలు వచ్చేవని రైతులు వాపోయారు.


చిత్తాపూర్‌లో మామిడికాయలు కోస్తున్న కూలీలు

## గంజాయి మత్తు.. యువత చిత్తు

- వినూత్న రీతిలో అమ్మకాలు
- కొత్తరకం సిగరెట్ ఫిల్టర్ల ద్వారా సేవిస్తున్న వైనం
- బానిసవుతున్న యువత



చెన్నూర్‌లో పట్టుబడిన గంజాయి నింపే ఫిల్టర్లు

చెన్నూర్: యువత గంజాయి మత్తులో పడి చిత్తవుతోంది. విచ్చలవిడిగా లభించడంతో చదువుకునే విద్యార్థులు సైతం గంజాయికి బానిసలై తమ బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారు. ఇటీవల చెన్నూర్ ప్రాంతంలో కిరాణా దుకాణంతో పాటు పలువురు యువకుల వద్ద రెండు కిలోల గంజాయి స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు తరలించిన విషయం తెలిసిందే. కొంతకాలంగా ఈ ప్రాంతంలో గుట్టుచప్పుడు కాకుండా గంజాయి అమ్మకాలు సాగుతున్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**మహారాష్ట్ర, జయశంకర్ భూపాలపల్లి జిల్లా నుంచి..**

పక్కనే ఉన్న మహారాష్ట్ర, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల నుంచి గంజాయి రవాణా సాగుతున్నట్లు సమాచారం. కొందరు యువత మహారాష్ట్ర, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలకు వెళ్లి గంజాయిని తీసుకొని వచ్చి ఇక్కడ విక్రయిస్తున్నట్లు సమాచారం.

**తక్కువ పెట్టుబడి.. ఎక్కువ రాబడి**

కొంతమంది యువత జల్సాల కోసం తక్కువ ధరకు లభించే గంజాయిని తెచ్చి ఎక్కువ ధరకు అమ్మకాలు చేస్తున్నట్లు సమాచారం. గంజాయి అమ్మకాల ద్వారా వచ్చిన డబ్బులతో జల్సాలు చేస్తున్నారు. కొందరు గంజాయి వ్యాపారులు 18 నుంచి 25 ఏళ్ల మధ్య వయస్సు గల యువతను టార్గెట్ చేసి దందా కొనసాగిస్తున్నట్లు తెలిసింది.

**ఆన్‌లైన్ ద్వారా ఫిల్టర్లు తెప్పించి..**

గంజాయి అమ్మకాలలో వ్యాపారులు కొత్తపుంతలు తొక్కుతున్నారు. సాధారణ సిగరేట్ ఫిల్టర్ మాదిరిగా ఉండే ఫిల్టర్లను ఆన్‌లైన్‌లో తెప్పించుకుంటున్నారు. అందులో గంజాయి నింపుతున్నారు. ఒక్కో గంజాయి ఫిల్టర్ను రూ.100 నుంచి రూ.200లకు విక్రయిస్తున్నట్లు తెలిసింది.

### గంజాయిపై నిఘా ఉంచాం



గంజాయి అమ్మకాలపై గట్టి నిఘా ఉంచాం. ఇటీవల ముగ్గుర్ని అరెస్టు చేశాం. ఇతర ప్రాంతాల నుంచి చెన్నూర్‌కు రాకుండా చర్యలు చేపట్టాం. ఎవరైనా గంజాయి విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. యువత గంజాయి మత్తుకు అలవాటుపడి బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దు.

– రవీందర్, సీఐ, చెన్నూర్

### పిడుగుపాటుతో మహిళ మృతి


లక్ష్మి మృతదేహం

ఖానాపూర్: పిడుగుపాటుతో మహిళ మృతి చెందిన సంఘటన మండలంలోని సింగాపూర్‌తండాలో చోటు చేసుకుంది. కడెం ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం తండాకు చెందిన రామెల లక్ష్మి (40) బుధవారం మొక్కజొన్న బూరు తీయడానికి పంటచేనుకు వెళ్లింది. ఉరుములతో కూడిన వర్షం రావడంతో చెట్టుకిందికి వెళ్లింది. చెట్టుపై పిడుగుపడడంతో అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలికి భర్త చిన్నపోశెట్టి, ముగ్గురు కూతుర్లు, కుమారుడు ఉన్నారు. భర్త చిన్నపోశెట్టి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

## ఐపీఎల్ బెట్టింగ్ రాయుళ్ల అరెస్ట్

- రూ.10వేల నగదు, 10 సెల్‌ఫోన్లు స్వాధీనం

సాక్షి ఎఫెక్ట్..

మంచిర్యాలక్రైం: ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్ రాయుళ్లను బుధవారం పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ నెల 15న 'బెట్టింగ్ జోరు' శీర్షికన 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి స్థానిక పోలీసులు స్పందించారు. సీఐ భన్సీలాల్ ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. తమకు అందిన సమాచారం మేరకు జిల్లా కేంద్రంలోని వాటర్ ట్యాంక్ ప్రాంతంలో కొందరు యువకులు ఐపీఎల్ బెట్టింగ్ ఆడుతుండగా దాడులు నిర్వహించి పదిమందిని అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.10 వేల నగదు, 10 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.


పోలీసుల అదుపులో బెట్టింగ్ రాయుళ్లు